క్లుప్తంగా

నేడు వెంకటాచలంలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం వెంకటాచలం మండలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు కాకుటూరులో ఉన్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో హాస్టల్ నూతన భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం 11 గంటలకు సరస్వతీనగర్‌లోని కమ్యూనిటీ హాలులో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలియజేశారు.

నావూరులో 'గడప గడపకు..'

పొదలకూరు : మండలంలోని నావూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొంటారని సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి సోమవారం తెలిపారు.

నేడు రామతీర్థంలో 'గడప గడపకు..'

కోవూరు(విడవలూరు) : విడవలూరు మండలం, రామతీర్థం ఎస్టీ కాలనీలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి సోమవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మోహినీ అవతారంలో కోదండరాముడు

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండ రామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి భక్తులకు మోహినీ అవతారంలో సోమవారం దర్శనమిచ్చారు. రాత్రి గరుడ సేవ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దొడ్ల మురళీకృష్ణారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

తాటిపర్తిలో డ్రోన్ సర్వే



సర్వేను ప్రారంభిస్తున్న అధికారులు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో డ్రోన్ ద్వారా భూముల రీసర్వేను సోమవారం ప్రారంభించారు. మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ముందుగా సర్వే ద్వారా విలేజ్ మ్యాప్‌ను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పాములూరు లచ్చారెడ్డి, మాజీ సర్పంచ్ పలుకూరు పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిపై దాడి

నెల్లూరు సిటీ: మద్యానికి నగదు ఇవ్వలేదని స్నేహితుడిపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కిసాన్‌నగర్, సింహపురికాలనీకి చెందిన మదన్, చిన్నా, మధు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం కిసాన్‌నగర్‌లోని ఓ బార్‌లో మద్యం తాగారు. మదన్, చిన్నా వద్ద నగదు అయిపోవడంతో రూ.300 ఇవ్వాలని మధును కోరారు. మధు నగదు ఇచ్చేందుకు నిరాకరించడంతో వారి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో రాయితో మధును కొట్టడంతో తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అపహరణ

నెల్లూరు సిటీ: స్నేహితుడి ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ అపహరణకు గురైన ఘటనపై బాధితుడు నవాబుపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. వివరాలు..నవాబుపేటలో నివాసం ఉంటున్న మనోహర్ ఈ నెల 2న నేతాజీనగర్‌లోని తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. ఇంటి ఎదుట బైక్‌ను పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లి వచ్చి చూడగా కనిపించలేదు. బైక్ కోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో వ్యక్తి హల్‌చల్



నెల్లూరు సిటీ: నగరంలోని కలెక్టరేట్ వద్ద ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. దీంతో కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చిన్నబజారు పోలీసులు కలెక్టరేట్ వద్దకు చేరుకుని అతనిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతని గురించి ఆరా తీయగా కోవూరు ప్రాంతానికి చెందినవాడిగా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న తండ్రి తమ బిడ్డకు మతిస్థిమితం లేక అనారోగ్యంతో ఉన్నాడని చెప్పడంతో అతనితో పంపించారు.

విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- మండలంలో కొత్తగా 250 స్తంభాల నిర్మాణం
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యల గుర్తింపు



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి(ఫైల్)

పొదలకూరు : సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలు కొలిక్కి వస్తున్నాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వల్ల గ్రామాలు, పట్టణంలో నెలకొన్న విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. మండలంలో 15 సచివాలయాల పరిధిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడప గడపకు తిరిగారు. మరో ఏడు సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సి ఉంది. ప్రతి ఇంటికి వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. ఇలా ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో ఇళ్లపై తీగలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తదితర సమస్యలను గుర్తించి పరిష్కరించారు. ఇలా ఎన్నో ఏళ్లుగా మరుపూరు, పులికల్లు తదితర గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ సమస్యలు ఉండేవి. వాటిని గుర్తించడంతో విద్యుత్ అధికారులు పరిష్కరించగలిగారు.

వేలంవెర్రిగా విద్యుత్ స్తంభాలు

పొదలకూరు పంచాయతీ పరిధిలో చాలాకాలంగా కొత్త విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో సమస్యలు ఉన్నాయి. ఈ పంచాయతీలో నాలుగు సచివాలయాల పరిధిలో మంత్రి కాకాణి సుమారు పది రోజుల పాటు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన చేతికి అందిన ప్రతి అర్జీకి సమాధానం ఇచ్చి పనులు చేయించారు. ఈ నేపథ్యంలో ప్రతి ప్రాంతంలో కొత్తగా విద్యుత్ స్తంభాలు అవసరమని ఆయా ప్రాంతాల వారు విజ్ఞప్తి చేశారు. దీంతో విద్యుత్ అధికారుల ద్వారా ఇప్పటి వరకు 75 స్తంభాలను నిర్మించి కొత్తగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయించి పంచాయతీ ద్వారా లైట్లు కూడా బిగించారు. ఇలా మండల పరిధిలో మరో 175 విద్యుత్ స్తంభాలను నిర్మించారు. కొత్తగా ఏర్పడిన వీధులు, కాలనీలకు కూడా విద్యుత్ కనెక్షన్లను ఏర్పాటు చేయించారు. ఒక్క పట్టణంలోనే లో–ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం ఇటీవల ఆరు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బిగించారు. ఫలితంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో స్తంభాల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మంత్రి ఆదేశాలతో పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. వ్యవసాయ అవసరాల కోసం అడిగిన వారికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నారు. ఇందుకోసం బల్క్ కనెక్షన్ల పేరుతో అధికారులు రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించి ఏర్పాటు చేస్తున్నారు. మెటీరియల్ దిగుమతులకు ఇబ్బంది లేకుండా మంత్రి చొరవ తీసుకుంటున్నారు.



పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు



స్తంభాలకు వైర్లను బిగిస్తున్న సిబ్బంది

ఎన్నడూ లేనివిధంగా..



గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. పట్టణంలోని పద్మావతినగర్లో మంత్రి కాకాణి 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన సందర్భంగా విద్యుత్ స్తంభాల నిర్మాణాన్ని ప్రస్తావించాం. వెంటనే స్తంభాలను ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేయించారు.

– జి.జయరామిరెడ్డి, స్థానికుడు, పొదలకూరు

పనుల్లో వేగం పెరిగింది



విద్యుత్ పనులు చేపట్టడంలో వేగం పెరిగింది. గతంలో ఎన్ని పర్యాయాలు కార్యాలయాలకు వెళ్లినా పనులు జరిగేవి కాదు. ఇప్పుడు మంత్రి ఆదేశాలతో ఎక్కడ సమస్య ఉన్నా పరిష్కారం అవుతోంది. రైతులకు ఇంతకంటే ఏమీ అవసరం లేదు.

– వై.పెంచలరెడ్డి, ఏఎంసీ చైర్మన్, పులికల్లు

పెండింగ్ పనులను పూర్తి చేస్తాం

గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన విద్యుత్ సమస్యలను దాదాపుగా పరిష్కరించాం. పెండింగ్‌లో ఉన్న పనులను కూడా వెంటనే పూర్తి చేశాం. మెటీరియల్ దిగుమతి చేసుకోవడంలో మంత్రి కాకాణి చొరవ చూపడం వల్లనే పనులు త్వరితగతిన పూర్తి చేయగలుగుతున్నాం.

– బి.సురేంద్రబాబు, విద్యుత్ ఏడీఈ, పొదలకూరు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు



తిరుచ్చి ఉత్సవంలో భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వరదరాజ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి కొడిగుడ్డను కట్టి ముక్కోటి దేవతలను ఆహ్వానం పలికారు. అనంతరం సంతానం లేని వారికి, అనారోగ్యంగా ఉన్న వారికి కొడి ముద్దలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి తిరుచ్చి ఉత్సవాన్ని నిర్వహించగా, రాత్రికి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

ఇంకుడు గుంత నిర్మించుకుంటే రూ.5 వేలు

- ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం



ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

కొడవలూరు : జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంత(సోక్ పిట్) నిర్మించుకుంటే ప్రభుత్వం రూ.5 వేలు మంజూరు చేస్తోందని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు సోక్ పిట్స్‌పై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు, డ్రెయిన్స్ పూర్తవని కాలనీల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలన్నారు. లేనిపక్షంలో వృథా నీటిని రోడ్లపైకి వదిలే ప్రమాదం ఉందన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఇంకుడు గుంత నిర్మాణానికి అయ్యే ఖర్చును చెల్లిస్తోందన్నారు. ఈ మేరకు ఇంజినీరింగ్ సహాయకులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ పాల్గొన్నారు.

నేడు రైతు కూలీ సంఘం జిల్లా మహాసభ



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి సునీత

నెల్లూరు(వేదాయపాళెం) : నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న ఏనుగు సుందరరామిరెడ్డి రోటరీ ఆడిటోరియంలో మంగళవారం రైతు కూలీ సంఘం ఉమ్మడి నెల్లూరు జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి సునీత తెలిపారు. సోమవారం సండేమార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘ రాష్ట్రాధ్యక్షురాలు ఝాన్సీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్‌బాబు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానాలు చేస్తామన్నారు. సంఘ నాయకులు, కార్యకర్తలు, రైతు కూలీలు సభలకు హాజరు కావాలని కోరారు. జిల్లా నాయకులు సుబ్బరాయుడు, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పొదలకూరు : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ



మనుబోలు : మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



కొడవలూరు : రెడ్డిపాళెంలో..



బుచ్చిరెడ్డిపాళెం : కనిసిరిపాళెంలో..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ

పొదలకూరు : గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత, ఇతర వ్యాధులు లేకుండా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.అన్నపూర్ణ పేర్కొన్నారు. మండలంలోని మొగళ్లూరు ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించాల్సిందిగా అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారానికి సంబంధించిన వివిధ పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు బుజ్జమ్మ, నాగరాణి, రజనీ, ప్రసూన్న తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్

మనుబోలు : మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే రక్తహీనతకు చెక్ పెట్టొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. మడమనూరు సెక్టార్‌లోని చెరుకుమూడి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ఆవశ్యకతపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తప్పకుండా తీసుకోవాలన్నారు. రక్తహీనతను నివారించేందుకు కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు, మినుములు లాంటి చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖ, సీతారామమ్మ, రమణమ్మ, సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మేళా

కొడవలూరు : మండలంలోని ఆలూరుపాడు మజరా రెడ్డిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మేళాను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలను ఆహార పదార్థాలుగా తయారు చేసుకోవడాన్ని ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ పోషకాహార లోపం వల్లే రక్తహీనత వస్తోందని, పోషకాలు పుష్కలంగా ఉండే చిరుధాన్యాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు జ్యోతి, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, సునీత, శీనమ్మ, సుస్మిత, ఆశా కార్యకర్తలు పద్మావతి, కిశోరమ్మ పాల్గొన్నారు.

- **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చిరెడ్డిపాళెంలోని కనిసిరిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డి, సూపర్‌వైజర్ శకుంతలమ్మ పాల్గొన్నారు.

'టెన్'షన్

తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నామనే భయం, మంచి మార్కులు సాధించాలనే పట్టుదలతో విద్యార్థులు తొలిరోజు 'పది' పరీక్షలకు 'టెన్'షన్ టెన్షన్‌గా వచ్చారు. తల్లిదండ్రులతో వచ్చి హాల్‌టికెట్ నంబర్లను సరిచూసుకుని తరగతి గదికి తరలారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి వాతావరణం నెలకొంది.

- తొలిరోజు పరీక్ష కేంద్రాల వద్ద హడావుడి వాతావరణం



ముత్తుకూరు : పరీక్ష కేంద్రం వెలుపల నిరీక్షిస్తున్న విద్యార్థులు

ముత్తుకూరు : మండల పరిధిలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. ముత్తుకూరు హైస్కూల్, వీబీఆర్ హైస్కూల్, పిడతాపోలూరు రత్నం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఉదయం 8 గంటలకే తమ బంధువులతో చేరిపోయారు. హాల్ టికెట్ల నంబర్లు, టేబుళ్లు సరిచూసుకోవడంలో హడావుడి పడ్డారు. మొత్తం 654 మంది విద్యార్థులకు 601 మంది పరీక్షలకు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

- **మనుబోలు :** పదో తరగతి పరీక్షలు మండల పరిధిలో ప్రారంభమయ్యాయి. మండలంలోని వీరంపల్లి, మడమనూరు, అక్కంపేట, బద్దెవోలు, మనుబోలు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు సుశ్రుత ఇంగ్లిష్ మీడియం ప్రైవేటు పాఠశాల విద్యార్థులతో కలిపి మొత్తం 298 మంది విద్యార్థులు మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్నారు. ముగ్గురు విద్యార్థులు గైర్హాజరవగా 295 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చీఫ్ ఆఫ్ ఎగ్జామినర్‌లు వసంతకుమారి, విజయలక్ష్మి తెలిపారు. ఎస్సై ముత్యాలరావు పాఠశాల ఆవరణలో 144 సెక్షన్ అమలు చేశారు.
- **వెంకటాచలం :** మండల పరిధిలో మొత్తం ఆరు పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమైన పది పరీక్షలకు 854 మంది విద్యార్థులకు 844 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు.
- **పొదలకూరు :** మండల పరిధిలో మొత్తం ఐదు పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు జరిగాయి. 793 మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఎస్సై కరిముల్లా పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.
- **ఇందుకూరుపేట :** మండలంలోని ఇందుకూరుపేట, ముదివర్తిపాళెం, నరసాపురం ఉన్నత పాఠశాలల్లో పది పరీక్షలు జరిగాయి. ఈ మూడు కేంద్రాల్లో 464 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 451 మంది పరీక్షలు రాశారని, 13 మంది గైర్హాజరయ్యారని ఇన్‌చార్జి ఎంఈఓ జయంతిబాబు తెలిపారు.
- **కొడవలూరు :** మండలంలోని ఐదు కేంద్రాల్లో పది పరీక్షలు జరిగాయి. 581 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా, తొమ్మిది మంది గైర్హాజరై, 572 మంది హాజరయ్యారని ఎంఈఓ జి.వసంతకుమారి తెలిపారు. కొడవలూరు, బొడ్డువారిపాళెం పరీక్ష కేంద్రాలను డైట్ అధ్యాపకుడు బాలాజీతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించారు.
- **బుచ్చిరెడ్డిపాళెం :** బుచ్చిరెడ్డిపాళెంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 1,011 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ దిలీప్ తెలిపారు. మొదటి పరీక్షను పలు కేంద్రాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.



ముత్తుకూరు హైస్కూల్‌లో హాల్‌టికెట్ల నంబర్లు చూసుకొంటున్న విద్యార్థులు



మనుబోలు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు



వెంకటాచలం పరీక్ష కేంద్రం వద్ద..



ఇందుకూరుపేట : నరసాపురంలో..



పొదలకూరు : పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థులు



బుచ్చిరెడ్డిపాళెం : డీఎల్ఎన్ఆర్ పాఠశాలలో..

పంచాయతీ అభివృద్ధిపై విజయోత్సవ ర్యాలీ

- చెత్త తరలింపునకు ఆటో వితరణ



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పొదలకూరు : పంచాయతీ పాలన పునఃప్రారంభమై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పొదలకూరు పంచాయతీ పాలకమండలి సభ్యులు అభివృద్ధి పనులను వివరిస్తూ పట్టణంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రామనగర్‌గేటు సెంటర్ నుంచి సంగంరోడ్డు సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం పంచాయతీ బస్టాండ్‌కు చేరుకుని కేక్‌కట్ చేసి పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ చిట్టెమ్మ మాట్లాడుతూ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రోత్సాహం వల్ల పొదలకూరును ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గతంలో ఐదురోజులకు తాగునీటిని విడుదల చేసేవారని, తమ పాలకమండలిలో మంత్రి కాకాణి సహకారంతో రోజు విడిచి రోజు తాగునీటిని అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కేఆర్‌ఆర్ గార్డెన్స్ యజమానులు సోమా భాస్కర్, మలిశెట్టి శివశంకర్‌లు పంచాయతీకి రూ.4 లక్షల విలువైన చెత్తను సేకరించే ఆటోను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సోమా అరుణ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, సెక్రటరీ అల్లా భిక్షు, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, వార్డుసభ్యులు అంజాద్, విజయలక్ష్మి, పద్మావతి, భాస్కర్, హరి, వాసు, హేమంత్, భాస్కర్‌రెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండ రామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాల వారు సోమవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాలు పూర్తయ్యేంత వరకు క్యాంప్ అందుబాటులో ఉంటుందని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మోర్ల జయంతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో..



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని మంగళగిరి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్ఎస్‌జే లక్ష్మి సోమవారం దర్శించుకున్నారు. గణపతిస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెకు అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.